## ఎస్టీ గురుకులంలో వైద్యపరీక్షలు

■ సిర్గాపూర్ జూలై 19 : మండలకేంద్రం సిర్గాపూర్‌లోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జలుబు, దగ్గు ఉన్నవారికి మందులు అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్వర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలో బాలికలు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యాధికారి విజయ్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.

## ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరణ

■ కంగ్టి, జూలై 19 : మండలంలోని ముర్కుంజాల్, రాసోల్ మీదుగా నారాయణఖేడ్ నుంచి తడ్కల్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరించినట్లు డిపో మేనేజర్ నర్సింహ తెలిపారు. బుధవారం తడ్కల్, ముర్కుంజాల్, రాసోల్ గ్రామాలను ఆయన సందర్శించారు. గ్రామస్తులు, విద్యార్థుల అభ్యర్థన మేరకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళలో బస్సు సర్వీసు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించొద్దన్నారు. నారాయణఖేడ్ నుంచి తడ్కల్, రాసోల్, ముర్కుంజాల్ మీదుగా బస్సును పునరుద్ధరించడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ పాండు, డిపో కార్మికుడు నెహ్రూ, సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్, జాగృతి అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ఉన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల శ్రమదానం



ఝరాసంగం - మేదపల్లి రోడ్డులో కంకర తెప్పించి, మరమ్మతులు చేయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

■ ఝరాసంగం, జూలై 19 : మండలంలోని మేదపల్లి గ్రామానికి వెళ్లి రోడ్డు గుంతలమయంగా కావడంతో బీఆర్ఎస్ నాయకులు శ్రమదానం రోడ్డు మరమ్మతులు చేశారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదేశాలతో బీఆర్ఎస్ నాయకులు విజేందర్‌రెడ్డి, సంతోష్, ఏజాజ్ బాబా తదితరులు బుధవారం ఝరాసంగం–మేదపల్లి రోడ్డులో గుంతలు పడిన ప్రాంతాల్లో కంకర వేయించి, పూడ్చి వేయించారు.

## వార్డు సభ్యుడికి చెక్ పవర్

■ కోహీర్, జూలై 19 : కోహీర్ గ్రామపంచాయతీ 7వ వార్డు సభ్యుడికి చెక్ పవర్ కట్టబెట్టారు. బుధవారం గ్రామపంచాయతీ అవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా, వార్డుసభ్యుడు కీజర్ అస్లంకు 15 మంది మద్దతు తెలిపారు. దీంతో సర్పంచ్ అతియా జావీద్‌తోపాటు అస్లంకు జాయింట్ చెక్ పవర్ ఇచ్చామని కార్యదర్శి లక్ష్మణాచారి తెలిపారు. గతంలో ఉప సర్పంచ్ మహ్మద్‌మోసిన్‌కు చెక్ పవర్ ఉండేది. కానీ, వివిధ ఆరోపణలతో ఈ నెల 7న చెక్ పవర్‌ను ఉన్నతాధికారులు రద్దు చేశారు.

## 21 నుంచి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా

■ నారాయణఖేడ్, జూలై 19 : ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు ఎంబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ మహారెడ్డి రోషన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏండ్ల యువతీయువకులు ఆధార్ కార్డు, 10వ తరగతి మెమో, రెండు ఫొటోలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు 7660047687 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి రెయిన్ కోట్ల పంపిణీ

■ నారాయణఖేడ్, జూలై 19 : మున్సిపల్ సిబ్బందికి బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగం రెయిన్‌కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎంఏ నజీబ్ మాట్లాడుతూ..వర్షాకాలంలో మున్సిపల్ పారిశుధ్య, నీటి సరఫరా సిబ్బంది ఇబ్బందులు పడకుండా ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సూచన మేరకు రెయిన్‌కోట్లను అందజేశామన్నారు. కార్మికులకు అవసరమైన సామగ్రిని సమకూర్చి ప్రోత్సహించినప్పుడే, వారు సక్రమంగా విధులు నిర్వహిస్తారని తెలిపారు.

## బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి

■ రాయికోడ్, జూలై 19 : బైక్‌పై నుంచి కింద పడి యువకుడు మృతి చెందాడు. ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు.. రాయికోడ్‌కు చెందిన నిజాంమోద్దీన్(32) బుధవారం ఉదయం మండలకేంద్రంలోని దవాఖానకు వెళ్లి, ఇంటికి వస్తుండగా బైక్‌పై నుంచి అకస్మాత్తుగా కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్సకు కుటుంబీకులు బీదర్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి సోదరుడు తాజోద్దీన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



బీఆర్ఎస్‌లో చేరిన మద్రి గ్రామానికి చెందిన రామలింగం, గొటిగార్‌పల్లికి చెందిన గొల్ల రాజు



గొటిగార్‌పల్లి గ్రామపంచాయతీ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

# బీఆర్ఎస్‌తోనే గ్రామస్వరాజ్యం

- ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు
- పంచాయతీ భవనానికి శంకుస్థాపన
- బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

కోహీర్, జూలై 19 : బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ పాలనతోనే గ్రామస్వరాజ్యం సాధ్యమని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. పంచాయతీ భవనంతో ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. బుధవారం మండలంలోని గొటిగార్‌పల్లిలో రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనుసూజమ్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు ఉన్నారు.

**బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు..**

గొటిగార్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గొల్ల రాజు బీఆర్ఎస్‌లో చేరారు. గొటిగార్‌పల్లి రైతు వేదిక ఆవరణలో జరిగిన సమావేశంలో రాజుకు ఎమ్మెల్యే గులాబీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. మద్రి గ్రామానికి చెందిన రాజలింగం బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను చూసి బీఆర్ఎస్‌లో చేరామన్నారు.

# మంత్రిని విమర్శించే స్థాయి విపక్షాలకు లేదు

- చెరుకు రైతు సమస్యలకు త్వరలో పరిష్కారం
- బీఆర్ఎస్ నాయకుడు ఢిల్లీ వసంత్‌కుమార్



జహీరాబాద్‌లో మాట్లాడుతున్న ఢిల్లీ వసంత్‌కుమార్

జహీరాబాద్, జూలై 19 : చెరకు రైతులకు పెండింగ్ బకాయిలు ఇప్పించడానికి మంత్రి హరీశ్‌రావు రాష్ట్రస్థాయి షుగర్ కేన్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి కృషి చేస్తుంటే.. కొందరు నాయకులు స్థాయిని మరిచి మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు ఢిల్లీ వసంత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జహీరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ చెరకు రైతులు, కార్మికులకు రావాల్సిన బకాయిలను యాజమన్యం నుంచి ఇప్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. మంగళవారం జహీరాబాద్‌లో చేపట్టిన చెరకు రైతుధర్నాలో అఖిలపక్ష నాయకులు స్థాయికి మించి మంత్రిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి మంత్రి కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో జహీరాబాద్ ఎమ్మెల్యే గీతారెడ్డి మంత్రిగా రైతు సమస్యలను ఎందుకు పరిష్కరించ లేదన్నారు. మంత్రి హరీశ్‌రావు కృషితో రైతులకు రూ. 3.5కోట్ల బకాయిలు చెల్లించాలని గుర్తు చేశారు. విపక్ష నాయకుల మాటలను చెరుకు రైతులు నమ్మరన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జనార్దన్, దత్తాత్రి, మహిపాల్, అశోక్ పాటిల్, యాసిన్ ఖాన్, అప్పం శ్రీకాంత్, విశాల్ గోడ్కె, దశరథ్, దినేశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హత్నూర ఎస్సైగా సుభాష్

హత్నూర, జూలై 19 : ఎస్సైగా కె.సుభాష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన లక్ష్మారెడ్డి బదిలీపై గుమ్మడిదలకు వెళ్లగా, ఆయన స్థానంలో అమీన్‌పూర్ నుంచి సుభాష్ బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

## 'ఖేడ్' ఆర్డీవోగా కొమురయ్య

నారాయణఖేడ్, జూలై 19 :మహబూబాబాద్ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న కొమురయ్యను నారాయణఖేడ్ ఆర్డీవోగా బదిలీ చేస్తూ బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ ఆర్డీవోగా ఉన్న అంబాదాస్ రాజేశ్వర్ బదిలీపై వెళ్లిన తర్వాత నర్సింహమూర్తి, మధుమోహన్ వచ్చారు. వీరిద్దరూ కొన్ని రోజుల్లో బదిలీ అయ్యారు.

# తెరిపిలేని వాన.. పంటలకు జీవం

జహీరాబాద్/ కంగ్టి/ హత్నూర, జూలై 19 : రెండు రోజులుగా జహీరాబాద్ మండలంలో కురుస్తున్న ముసురు పంటలకు ఊపిరి పోసింది. మంగళవారం, బుధవారం నుంచి జహీరాబాద్ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన పంటలకు జీవం పోసింది. రైతులు వానకాలం సీజన్‌లో పత్తి, సోయా, కంది, జొన్న, పెసర, మినుముతో పాటు ఇతర వాణిజ్య పంటలను సాగు చేశారు. వర్షాలు కురువకపోవడంతో పంటలు ఎండుదశకు చేరాయి. ఇలాంటి స్థితిలో వాన పడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వానలు కురుస్తుండడంతో పంటలకు యూరియా, డీఏడీ, పొటాష్ ఎరువులు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వర్షం కురవడంతో వాగులు, చెక్‌డ్యాంలు, చెరువులోకి వరదనీరు వచ్చి చేరుతుంది. నారింజ వాగు వరదనీరుతో ప్రవహిస్తున్నది.

**పంటపొలాల్లోకి వరదనీరు**

కంగ్టి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పంటపొలాల్లోకి వరద చేరుతున్నది. మంగళవారం రాత్రి కురిసిన వర్షం 38.2 మిల్లీమీటరుగా నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. నష్టపోయిన పంటలకు పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు అందజ్తేమని ఏవో ప్రవీణ్‌చారి తెలిపారు.

**ముమ్మరంగా వ్యవసాయ పనులు**

హత్నూర మండల వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతున్నది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షానికి పొలాల్లో నీరు చేరుతుండడంతో వరినాట్ల పనులను రైతులు ముమ్మరంగా చేపడుతున్నారు.

# ఓటరు జాబితాపై బీఎల్‌వోలకు అవగాహన



నారాయణఖేడ్‌లో మాట్లాడుతున్న అధికారులు

కంగ్టి/ నారాయణఖేడ్, జూలై 19 : ఓటరు జాబితాపై బీఎల్‌వోలకు బుధవారం కంగ్టి మండలకేంద్రంలో అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు, చిరునామాలో ఏవైనా సవరణలు చేసుకునేవారు స్థానిక బీఎల్‌వోలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 ఏండ్లు నిండినవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డుతో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలోని తప్పొప్పులను ఎప్పటికప్పుడు సవరించుకోవాలన్నారు. పోలింగ్‌బూత్‌లను సందర్శించి, సమస్యలను నివేదించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జుబేర్ ఉన్నారు.

**పకడ్బందీగా ఓటరు నమోదు చేపట్టాలి**

నారాయణఖేడ్ మండలంలో ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలని బీఎల్‌వోలకు మాస్టర్ ట్రైనర్స్ కృష్ణకుమార్, కిశోర్ సూచించారు. జూకల్ శివారులో ఉన్న ఆడిటోరియంలో బీఎల్‌వోలకు ఓటరు నమోదుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదుకు ఫారం–6, మార్పులుచేర్పులు, తొలిగింపులకు ఫారం–7, ఫారం–8 దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఓటరు నమోదు యాప్‌ల ద్వారా ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు రాజు, అనుదీప్, ఆర్ఐ మాధవరెడ్డి ఉన్నారు.

# మొక్కల సంరక్షణ పౌర బాధ్యత

- హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలి
- ఎంపీడీవోలు సుజాత, వెంకట్‌రెడ్డి
- వేర్వేరు ప్రాంతాల్లో హరితహారం

సిర్గాపూర్/ న్యాల్‌కల్/ కంగ్టి, జూలై 19 : సిర్గాపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం హరితహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలను ఏపీవో రమేశ్‌తో కలిసి ఎంపీడీవో సుజాత నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ 6 మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాల్సి బాధ్యత పౌరులపై ఉందన్నారు. కార్యక్రమంలో టీపీ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

**మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలి**

న్యాల్‌కల్ మండలంలోని అన్ని గ్రామాల్లో హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి ఎంపీడీవో వెంకట్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రం న్యాల్‌కల్‌లో ఏర్పాటు చేసిన నర్సరీలో హరితహారం మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పొలంగట్లు, రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజూ నీరు పోసి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కంగ్టి దవాఖానలో హరితహారం**

కంగ్టి ప్రభుత్వ దవాఖానలో హరితహారం నిర్వహించారు. దవాఖాన ఆవరణలో సిబ్బంది, అధికారులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ.. ఎనిమిదేండ్లుగా హరితహారం మొక్కలను సంరక్షించడంతో గ్రామాల్లో పచ్చదనం పెరిగిందన్నారు. దవాఖానలో హరితహారం మొక్కలు వనంగా పెరిగాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని సూచించారు.



సిర్గాపూర్ : ఎంపీపీ ఆఫీసు ఎదుట మొక్కను నాటి, నీళ్లు పోస్తున్న ఎంపీడీవో సుజాత, సిబ్బంది